**ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం**

**ప్రాంతీయ వార్తా విభాగం**

**ప్రాంతీయ వార్తలు**

**తేదీ: 13.10.2024 సమయం 1310 గంటలు**

**ముఖ్యాంశాలు**

**1.జాతీయ సమైక్యతను పెంపొందించడానికి అలయ్ బలయ్ లాంటి ఉత్సవాలు దోహద పడతాయని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు.**

**2.మూడు సంవత్సరాలు పూర్తి చేసుకున్న "ప్రధానమంత్రి గతిశక్తి యోజన" మౌలిక సదుపాయాల కల్పనలో విప్లవాత్మక మార్పులు తెచ్చిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు.**

**3.రాష్టంలో సాధారణ ఓటర్ల జాబితా ముసాయిదాను ఈ నెల 29వ తేదీన ప్రచురించనున్నారు.**

**4.ఈ నెల 21 నుంచి 27వ తేదీ వరకు జరిగే తెలంగాణ గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు హాల్ టిక్కెట్లు రేపటి నుంచి అందుబాటులోకి వస్తాయి.**

అలయ్ బలాయ్

-హర్యాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ ప్రారంభించి, ఏటా దసరా పండుగ తరువాతి రోజు నిర్వహించే అలాయ్ బలాయ్ సంబురాలు నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో అట్టహాసంగా జరుగుతున్నాయి. అలాయ్ బలయ్ కమిటీ ఛైర్మన్ బండారు విజయలక్ష్మి అధ్యక్షతన ప్రారంభం అయిన ఈ సంబరాలకు మాజీ ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు, రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాజస్థాన్ గవర్నర్ హరిబౌ బగాడ్, ఉత్తారఖండ్ గవర్నర్ గురుమీత్

సింగ్, మేఘాలయ గవర్నర్ విజయ శంకర్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, మహారాష్ట్ర మాజీ గవర్నర్ సి హెచ్  విద్యాసాగరరావు, , కాంగ్రెస్ , బీఆర్ఎస్ సహా పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు. 2005 నుంచి రాజకీయాలకు అతీతంగా నేతలందరినీ ఒక వేదిక పైకి తీసుకు వచ్చే ఉద్దేశ్యంతో దత్తాత్రేయ అలయ్ బలయ్ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మాజీ ఉపరాష్ట్రపతి  వెంకయ్యనాయుడు మాట్లాడుతూ, ప్రస్తుత సమాజానికి సమైక్యత ఎంతో అవసరం అని అన్నారు. ఐక్యత అనే భారతీయ సంస్కృతిని ముందుకు తీసుకు వెళ్ళేందుకు ఇలాంటి పండుగలు దోహదం చేస్తాయని ఆయన పేర్కొన్నారు. పండుగలు కుంటుంబాలను, సామాజాన్నీ, రాష్ట్రాన్నీ, జాతినీ ఐక్యతగా ఉంచే సందర్భాలని చెబుతూ, ఈ సాంప్రదాయాన్ని కొనసాగించాలని సూచించారు.

--(MSL)

అలయ్ బలయ్ యాడ్

-తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ..భారతీయ పండుగలు సమాజంలోని వివిధ వర్గాల్లో సమైక్యత పెంపొందిస్తాయని అన్నారు. తెలంగాణ సాంస్కృతికంగా సాధించిన ప్రగతికి ఈఅలయ్ బలయ్ కార్యక్రమం నిదర్శమని అన్నారు. బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ..రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు దేశానికి ఐక్యతను చాటిచెప్పాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జానారెడ్డి, బీఆర్ ఎస్ నేత తలసాని శ్రీనివాస్ యాదవ్ లు కూడా ప్రసంగించారు. ఈ సందర్భంగా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిభింబించే సాంస్కృతిక

కార్యక్రమాలను ప్రదర్శిస్తున్నారు. నోరూరించే తెలంగాణ సంప్రదాయ వంటకాలను ఆహుతులకు అందిస్తున్నారు.

--ఎం.ఎస్.ఎల్

గతిశక్తి

-ప్రధాన మంత్రి గతిశక్తి నేషనల్ మాస్టర్ ప్లాన్ మూడేళ్లు పూర్తిచేసుకోవడం భారతదేశ మౌలిక సదుపాయాలలో విప్లవాత్మకమైన మార్పుగా ఆవిర్భవించిందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రశంసించారు. మల్టీమోడల్ కనెక్టివిటీని గతిశక్తి గణనీయంగా పెంచిందని, అన్ని రంగాలలో వేగవంతమైన , మరింత సమర్థవంతమైన అభివృద్ధికి దోహద పడుతోందని ప్రధానమంత్రి సోషల్ మీడియా పోస్ట్ లో పేర్కొన్నారు. వివిధ వర్గాల అనుసంధానం కారణంగా రవాణా సౌకర్యాలు మెరుగు పడ్డాయని, ఆలస్యాలు తగ్గాయని, అనేకమందికి కొత్త అవకాశాలు సృష్టించడానికి దారితీసిందని ప్రధాని అన్నారు.

--(NSD)

ఓటర్ల జాబితా

-రాష్ట్రంలో సాధారణ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియతో పాటు శాసనమండలి ద్వైవార్షిక ఎన్నికల కోసం ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియ కొనసాగుతోంది. 2025 జనవరి ఒకటో తేదీ ప్రామాణికంగా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టింది. 2025 జనవరి ఒకటో తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండే ప్రతి ఒక్కరూ ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కల్పించింది. వీరితో పాటు 18 ఏళ్లు నిండి ఓటుహక్కు లేని వారు, మార్పులు-

చేర్పులు అవసరమైన వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ నెల 29వ తేదీన ఓటర్ల జాబితా ముసాయిదా ప్రచురిస్తారు. ఆ రోజు నుంచి నెల రోజుల పాటు నవంబర్ 28వరకు ముసాయిదాపై అభ్యంతరాలు, వినతులు స్వీకరిస్తారు. ఈ సమయంలో రెండు రోజులు ప్రత్యేక ప్రచారం నిర్వహిస్తారు. నవంబర్ నెలలో రెండో శనివారమైన తొమ్మిది, ఆ మరుసటి రోజు ఆదివారం పదో తేదీన పోలింగ్ కేంద్రాల వద్ద బూత్ స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారు. బీఎల్ఓల సహాయంతో పోలింగ్ కేంద్రాల వద్దే జాబితాలో ఉన్న పేర్లు, వివరాలు సరిచూసుకోవచ్చు. మార్పులు-చేర్పులు, అభ్యంతరాలు ఉంటే తగిన ఆధారాలతో అక్కడే దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్, యాప్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకునే సదుపాయం ఉంది. వచ్చిన అభ్యంతరాలు, వినతులను డిసెంబర్ 24వ తేదీ వరకు పరిష్కరించి 2025 జనవరి ఆరో తేదీన తుది జాబితా ప్రకటిస్తారు.

--(DESK)

మధుసూదనాచారి

-శాసనమండలి ప్రతిపక్ష నేతగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ మధుసూదనాచారి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మధుసూదనాచారికి బీఆర్ఎస్ కార్యనిర్వహక అధ్యక్షుడు తారక రామారావు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. శాసనమండలి తొలి చైర్మన్ స్వామిగౌడ్, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో పాటు పలువురు ఎమ్మెల్సీలు మధుసూదనాచారికి శుభాంక్షలు తెలిపి, శాలువాలతో సత్కరించారు.

--(DESK)

గ్రూప్-1

-ఈ నెల 21 నుంచి 27వ తేదీ వరకు జరిగే తెలంగాణ గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు హాల్ టిక్కెట్లు రేపటి నుంచి అందుబాటులోకి వస్తాయి. అభ్యర్థులు tspsc.gov.in వెబ్ సైట్ లో వివరాలు నమోదు చేసి హాల్ టిక్కెట్లు డౌన్ లోడ్ చేసుకోవచ్చని టీఎస్ పీఎస్సీ తెలిపింది. మొత్తం 31 వేల 382 మంది అభ్యర్థులు మెయిన్స్ పరీక్షలకు హాజరుకానున్నారు.

---డెస్క్

పంటరుణాల మాఫీ

రాజన్న సిరిసిల్ల జిల్లాలో రైతుల పంటరుణాల మాఫీ ప్రక్రియ ఇంకా కొనసాగుతోందని జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ మల్లికార్జున్ పేర్కొన్నారు.జిల్లా వ్యాప్తంగా 71 బ్యాంకుల పరిధిలో 63 వేల 502 మంది రైతులు పంట రుణాలను తీసుకోగా, మూడు విడతల్లో 43 వేల 770 మంది రైతుల 2లక్షల లోపు రుణాలు మాఫీ అయినట్లు ఆయన చెప్పారు. ఇంకా 19వేల 732 మంది రైతుల రుణాలు పెండింగ్ లో ఉన్నాయని, వ్యవసాయ శాఖ ద్వారా క్లస్టర్ వారీగా రుణమాఫీ పరిధిలోకి రాని రైతుల వివరాలను సేకరించారని తెలిపారు.

--(PTC-RS)

నాగర్ కర్నూలు

-నాగర్ కర్నూలు జిల్లా కేంద్రంలో ఆటో బోల్తాపడిన ప్రమాదంలో ఒక మహిళ కూలీ మృతి చెందారు. మరో పదిమంది కూలీలు గాయపడ్డారు.

-పీటీసీ, నాగర్ కర్నూలు

నల్లగొండ

-దసరా పండుగ ముగియడంతో స్వస్థలాల నుంచి తిరిగి వస్తున్న ప్రయాణికులతో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై రద్దీ నెలకొంది. చౌటుప్పల్ సమీపంలో పంతంగి టోల్ ప్లాజా వద్ద రద్దీకి అనుగుణంగా హైదరాబాద్ వైపు ఎక్కువ బూత్ లు తెరిచి ఉంచారు. పోలీసులు ట్రాఫిక్ ను క్రమబద్ధం చేస్తున్నారు. గుంటూరు, మిర్యాలగూడ, సాగర్ –హైదరాబాద్ రహదారీపై కూడా రద్దీ నెలకొంది.

--పీటీసీ, నల్లగొండ

పత్తి కొనుగోళ్లు

రాజన్న సిరిసిల్ల జిల్లాలో పత్తి పంటను మద్దతు ధరపై కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు,జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. జిల్లాలో 42 వేల 390 ఎకరాల్లో పత్తి వేశారని,30 వేలకు పైగా మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేసినట్టు ఆయన పేర్కొన్నారు.జిల్లాలోని సుద్దాల, నాంపల్లి, సంకేపల్లి, గొల్లపల్లి, తాళ్లపల్లిలోని కాటన్ ఇండస్ట్రీస్ ద్వారా - సీసీఐ పత్తి కొనుగోలు చేస్తుందని చెప్పారు. పొడవు పింజరకం పత్తి కి క్వింటాల్ ఏడు వేల 521 రూపాయల మద్దతు ధరను ప్రభుత్వం ప్రకటించిందని, మద్దతు కంటే తక్కువకు పంట అమ్మవద్దని, మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దని ఆయన రైతులకు సూచించారు.

--PTC-RS)

కరాటే శిక్షణ

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 139 ప్రభుత్వ పాఠశాలల్లో  విద్యార్థులకు కరాటేలో శిక్షణ ఇచ్చేందుకు శిక్షకులను నియమిస్తున్నట్లు, జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి ఆజ్మీరా రాందాస్  తెలిపారు. విద్యార్థినులకు ఆత్మ రక్షణ విద్యలో శిక్షణ ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం  రాణిలక్ష్మీభాయి రక్షా ప్రశిక్షణ్ పథకాన్ని అమలు చేస్తోందనిచెప్పారు. . కరాటేలో బ్లాక్ బెల్ట్ ఉండి, కనీసం రెండేళ్ల శిక్షణ అనుభవం ఉన్న, 35 ఏళ్లు నిండిన మహిళలు, పురుషులు పూర్తి వివరాలతో ఈ నెల 16లోగా జిల్లా యువజన, క్రీడాశాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

--(PTC-RS)

వాతావరణం

-తెలంగాణలో పలు చోట్ల ఈ రోజు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. హైదరాబాద్ లో ఈ నెల 16 వరకు తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

--(DESK)

భద్రాచలం

-భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో శరన్నవరాత్రి వేడుకలు నిన్నటితో ముగిసాయి. నిన్న చివరి రోజున మహాలక్ష్మి అవతారంలో ఉన్న అమ్మవారిని వేలాది మంది భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దసరా మండపంలో జమ్మి చెట్టు కింద స్వామివారి ఆయుధాలకు ఆయుధపూజ నిర్వహించారు.శ్రీరామలీల మహోత్సవంలో భాగంగా రావణ దహనం నిర్వహించారు. శ్రీ రామలీల మహోత్సవాన్ని పెద్ద సంఖ్యలో భక్తులు వీక్షించారు.

--(PTC-BCM)